సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 6 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.40 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 408 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



అద్భుతం.. మనోల్లాసం
ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలోని పార్కు ఆహ్లాదం పంచుతూ మనోల్లాసం కలిగిస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
37.7°/23.2°

జిల్లావ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం

రొద్దం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం జిల్లా వ్యాప్తంగా అలజడులు రేగాయి. మంగళవారం రాత్రి రొద్దంలో కొందరు దుండగులు డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహం చేయిని విరగొట్టారు. బుధవారం ఉదయం గుర్తించిన వైఎస్సార్ సీపీ నాయకులు విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ల్యాప్‌టాప్ అనుకుంటే బండరాయి వచ్చింది!



ప్యాకింగ్‌లో వచ్చిన బండరాయి

అనంతపురం ఎడ్యుకేషన్: కొరియర్‌లో ల్యాప్‌టాప్ వచ్చిందనుకుంటే బండరాయి కనిపించిన సంఘటన నగరంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల సమగ్ర శిక్ష డీపీసీ, ఏపీసీలకు హెచ్‌పీ కంపెనీ 12 జనరేషన్, 16 జీబీ ర్యామ్, 1టీబీ ఎస్‌ఎస్‌డీ, స్క్రీన్ విండోస్ 11 ప్రో, ఎంఎస్ ఆఫీస్ అడాప్టర్ క్యారీ కేస్ సామర్థ్యం కల్గిన ల్యాప్‌టాప్స్ కొనుగోలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కంప్యూటర్ ఇండియా అనే సంస్థ ఈ ల్యాప్‌టాప్స్‌ను సరఫరా చేసింది. మే 31న జిల్లాకు వచ్చాయి. డీపీసీగా ఉన్న డీఈఓ తనకు అందిన ప్యాకింగ్ ఓపెన్ చేయగా, ల్యాప్‌టాప్ ఉంది. ఈ క్రమంలోనే జిల్లాకు పంపిన రెండు ల్యాప్‌టాప్‌ల్లో ఒకదానిని అందుకున్నట్లు సమాచారం పంపారని, రెండో దాని వివరాలు పంపాలంటూ బుధవారం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. దీంతో సమగ్ర శిక్ష ఏపీసీకి వచ్చిన పార్శిల్‌ను ఓపెన్ చేయగా.. అందులో బండరాయి దర్శనం ఇచ్చింది. ఆ రాయికే కవర్లు కప్పి ఉంది. అందులోనూ దాదాపు ల్యాప్‌టాప్ బరువు ఏ మేర ఉంటుందో అంతేస్థాయి బరువున్న రాయి ఉంచారు. అయితే, ఈ విషయాన్ని వెంటనే రాష్ట్ర కార్యాలయ అధికారుల దృష్టికి స్థానిక సిబ్బంది తీసుకెళ్లారు. ల్యాప్‌టాప్ పార్శిల్ కవరుపై ఉన్న కంప్యూటర్ ఇండియా సంస్థ ఫోన్ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

'నీట్'లో శ్రీసత్యసాయి విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు



తల్లిదండ్రులతో జి.లాస్య



ఆల్‌ఇండియా ర్యాంకర్ దివ్యతేజ

హిందూపురం టౌన్/ తలుపుల/ముదిగుబ్బ: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు మే 5వ తేదీన నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల్లో శ్రీసత్యసాయి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు దక్కించుకున్నారు. హిందూపురానికి చెందిన జి. లాస్య జనరల్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 715 మార్కులతో 109 ర్యాంకు సాధించింది. లాస్య తల్లిదండ్రులు వెంకట ప్రసాద్, సువర్చ ఇద్దరూ ఉపాధ్యాయులే. లాస్యను ఏపీటీఎస్ మండల శాఖ, ఉపాధ్యాయులు అభినందించారు. ఇక తలుపుల బలిజపేటకు చెందిన ఉపాధ్యాయుడు పి. రాంప్రసాద్, లక్ష్మీదేవిల కుమార్తె పి.దివ్యతేజ నీట్ ఫలితాల్లో 530వ ర్యాంకు సాధించింది. మొత్తం 720 మార్కులకు గాను దివ్యతేజ 710 మార్కులు సాధించింది. ఎంబీబీఎస్ పూర్తి చేసి మంచి వైద్యురాలిగా పేదలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని దివ్యతేజ తెలిపింది. ఇక ముదిగుబ్బకు చెందిన గణేష్ నాయక్ నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 24,626 ర్యాంక్ సాధించాడు. గణేష్ నాయక్ మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు వెంకటేష్ నాయక్, తులసీబాయి, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.



కుటుంబ సభ్యులతో గణేష్ నాయక్

అరకొరతో ఆరు సీట్లు!

- కూటమి అభ్యర్థులకు కలిసి వచ్చిన అవకాశం
- 85,095 ఓట్ల తేడాతో వైఎస్సార్ సీపీ చేజారిన ఆరు సీట్లు
- వైఎస్సార్‌సీపీ, కూటమి మధ్య ఓట్ల తేడా అంతంతే



హిందూపురం బిట్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న అధికారులు (ఫైల్)



మడకశిర అసెంబ్లీ స్థానం పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అరకొర ఓట్లతేడాతో ఆరు సీట్లు దక్కించుకుంది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ సీట్ల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కూటమి మధ్య ఓట్ల తేడా కేవలం 85,095 ఓట్లు మాత్రమే. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 12,03,535 ఓట్లు పోలయ్యాయి. అందులో కూటమికి 6,02,960 ఓట్లు రాగా.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు 5,17,865 ఓట్లు పోలయ్యాయి.

కొన్ని ఏకపక్షం...కొన్ని స్థానాల్లో ఉత్కంఠ..

మంగళవారం ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా, హిందూపురం, పెనుకొండ అసెంబ్లీ స్థానాల్లో మెజార్టీ ఆరంభం నుంచి ఏకపక్షంగా టీడీపీ వైపు మొగ్గుచూపింది. అయితే కదిరి, ధర్మవరం నియోజకవర్గాలు సగం రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నాయి. ఆ తర్వాత కూటమి వైపు ఫలితాలు మళ్లాయి. కాగా.. పుట్టపర్తి తొలి రెండు – మూడు రౌండ్లలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వచ్చినా.. ఆ తర్వాత టీడీపీ వైపు మొగ్గు చూపింది.

చివరి రౌండ్‌లో తేలిన మడకశిర ఫలితం..

ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిర నియోజకవర్గ ఫలితం చివరి రౌండు వరకు ఉత్కంఠను రేపింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఈవీఎం మార్చేశారని వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప ఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. రొళ్ల మండలం పిల్లిగుండ్లు 131 బూత్ ఈవీఎంను అధికారులు తారుమారు చేసినట్లు వెల్లడించారు. ఈవీఎం బటన్ నొక్కితే వైఎస్సార్ సీపీకి ఐదు ఓట్లను మాత్రమే చూపించిందని, అనుమానం వచ్చి ఆర్‌ఓకు ఫిర్యాదు చేయడంతో వీవీ ప్యాట్లలోని స్లిప్‌లను లెక్కించగా వైఎస్సార్‌సీపీకి 414 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా అమరాపురం మండలం హేమావతి 36 బూత్ ఈవీఎం అసలు ఓపెన్ కాలేదు. దీంతో వీవీ ప్యాట్లలోని స్లిప్‌లను లెక్కించాల్సి వచ్చింది. ఇలా ఈవీఎంల ఓట్ల లెక్కింపులో లోపాలు ఎన్నో జరిగి ఉంటాయని ఈరలక్కప్ప అనుమానం వ్యక్తం చేశారు.

నాలుగు స్థానాల్లో మెజార్టీ అంతంతే

ఆరు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో నాలుగు స్థానాల్లో కూటమి అభ్యర్థుల మెజార్టీ అంతంతే ఉంది. మడకశిరలో ఈరలక్కప్పపై టీడీపీ అభ్యర్థి కేవలం 351 ఓట్ల మెజార్టీ సాధించారు. వాస్తవానికి ఈ స్థానంలో మొదట అధికారులు 25 ఓట్ల మెజార్టీ ప్రకటించారు. అయితే ఆ తర్వాత మెజార్టీని 351కి మార్చారు. ఆ తర్వాత ధర్మవరంలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై బీజేపీ అభ్యర్థి కేవలం 3,734 ఓట్ల మెజార్టీ సాధించారు. ఈ స్థానంలోనూ దాదాపు 12 రౌండ్ల వరకూ వైఎస్సార్ సీపీనే మెజార్టీ సాధిస్తూ వచ్చింది. కదిరిలోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మక్బూల్ సగం రౌండ్ల వరకూ ప్రభావం చూపారు. చివరకు టీడీపీ అభ్యర్థి 6,265 ఓట్ల మెజార్టీ సాధించారు. హిందూపురంలో టీడీపీ అభ్యర్థి 32,593 ఓట్ల మెజార్టీ సాధించగా, పెనుకొండ అభ్యర్థి 33,388 ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తంగా చూస్తే నాలుగు స్థానాల్లో కూటమి అభ్యర్థులు పెద్ద మెజార్టీ సాధించలేకపోయారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
మడకశిర (ఎస్సీ)	2,11,074	1,86,138
హిందూపురం	2,46,463	1,96,211
పెనుకొండ	2,33,682	2,07,569
పుట్టపర్తి	2,10,076	1,83,975
ధర్మవరం	2,39,557	2,20,455
కదిరి	2,50,776	2,09,187
మొత్తం	13,91,628	12,01,014

వైఎస్సార్‌సీపీకి పోలైన ఓట్లు

నియోజకవర్గం	ఈవీఎం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్లు	మొత్తం
మడకశిర (ఎస్సీ)	79,148	484	79,632
హిందూపురం	74,176	477	74,653
పెనుకొండ	79,795	649	80,444
పుట్టపర్తి	82,216	765	82,981
ధర్మవరం	1,01,983	827	1,02,810
కదిరి	96,229	1,116	97,345

టీడీపీకి వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	ఈవీఎం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్లు	మొత్తం
మడకశిర (ఎస్సీ)	79,244	739	79,983
హిందూపురం	1,05,778	1,472	1,07,250
పెనుకొండ	1,11,960	1,872	1,13,832
పుట్టపర్తి	90,173	1,568	91,741
ధర్మవరం	104957	1,587	1,06,544
కదిరి	1,01,191	2,419	1,03,610

సహకరించిన అందరికీ ధన్యవాదాలు

- సమష్టి కృషితోనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం
- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



కలెక్టర్ అరుణ్‌బాబు



మాధవరెడ్డి ఎస్పీ

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ దగ్గరి నుంచి కౌంటింగ్ దాకా జిల్లా యంత్రాంగం పూర్తి నిబద్ధతతో పనిచేసిందని కొనియాడారు. జిల్లా ప్రజలు, యంత్రాంగం సమష్టి కృషి తోనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. జిల్లాలోని రెండు కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపులో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది అద్భుతంగా పనిచేశారన్నారు. అలాగే అన్ని విధాల సహాయక సహకారాలు అందించిన ఎన్నికల అబ్జర్వర్లకు, ఎస్పీ మాధవరెడ్డికి, పోలీస్ అధికారులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, నోడల్ ఆఫీసర్లు, ఏఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు నిఘా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అద్భుతంగా పనిచేశారని, వారందరికీ అభినందనలు తెలుపుతున్నానన్నారు.

మీ సహకారం మరువలేనిది : ఎస్పీ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు యంత్రాంగానికి జిల్లా ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా ముగించినందుకు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో కీలక ఘట్టమైన కౌంటింగ్ ప్రక్రియను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు. ఇందులో కీలక పాత్ర పోషించిన పోలీసులతో పాటు కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అంకితభావం, చిత్తశుద్ధితో పోలీసులు పనిచేశారన్నారు.

ఆశలు రేపుతున్న నైరుతి

- సాగుకు ఉత్సాహంగా సిద్ధమవుతున్న రైతన్న
- అందుబాటులో కావాల్సినన్ని విత్తనాలు, ఎరువులు



విత్తన సాగు చేస్తున్న రైతన్న

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాలు ఆశలు రేపుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు ఇప్పటికే వేరుశనగ విత్తు పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు ప్రభుత్వం ఇప్పటికే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు అధికంగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో 2,44,763 హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేసిన వ్యవసాయశాఖ 1.04 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ సిద్ధం చేసింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తన కాయలు అందజేస్తోంది. ఇప్పటి వరకూ 69,411 మంది రైతులు 61,879 క్వింటాళ్ల వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. బోరుబావుల కింద నీటి వసతి ఉన్న రైతులు ఇప్పటికే విత్తనం వేశారు.



సబ్సిడీ విత్తన కాయలను తీసుకెళ్తున్న రైతులు



విత్తన శుద్ధి మందును వేరుశనగలో కలుపుతున్న రైతులు

చిరుజీవులు ఛిద్రం

- రాకెట్ల వద్ద రోడ్డు ప్రమాదం
- ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరి దుర్మరణం





మృతి చెందిన నాగభూషణం, హనుమక్క(ఫైల్)




నుజ్జు నుజ్జయిన ఆటో

ఉరవకొండ: వారు చిరుజీవులు. రోజూ గ్రామాల్లో కూరగాయలు విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో పొట్ట పోసుకుంటున్నారు.అలాంటి వారిని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని రాకెట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన మేరకు.. రాకెట్ల గ్రామానికి చెందిన నాగభూషణం (55), హనుమక్క (60) రోజూ ఆటోలో కాయగూరలు తీసుకెళ్లి గ్రామాల్లో విక్రయిస్తుంటారు. బుధవారం కూడా రోజూ మాదిరిగా బయలుదేరారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలో కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన నాగభూషణం, హనుమక్క అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని 108 వాహనంలో మృతదేహాలను ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగభూషణానికి భార్య కవితతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. హనుమక్కకు ముగ్గురు కుమారులున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే అందరూ ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. నాగభూషణం మృతదేహం వద్ద భార్య, కుమారులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

నోటాకు ఓటేశారు..!

- హిందూపురం పార్లమెంట్ స్థానంలో 15,950 ఓట్లు
- ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,058 మంది నోటాకే మద్దతు



నోటాకు పోలైన ఓట్లు ఇలా...

నియోజకవర్గం	నోటాకు వచ్చిన ఓట్లు	నిలిచిన స్థానం
మడకశిర	2,728	5
కదిరి	2,519	4
పెనుకొండ	1,956	5
ధర్మవరం	1,787	4
హిందూపురం	1,686	4
పుట్టపర్తి	1,382	5

హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా విజయం కోసం పోటాపోటీగా తలపడ్డారు. స్వతంత్రులు, పలు పార్టీల నేతలూ ఉనికి కోసం వెంపర్లాడారు. అయితే ఫలితాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులను పక్కనపెడితే చాలా చోట్ల నోటాకే ఎక్కువ ఓట్లు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఎన్నికల్లో నోటాకు ఓటేసిన వారి సంఖ్య కాస్త పెరిగింది.

మడకశిరలో అత్యధికంగా నోటా ఓట్లు..

చట్టసభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమైనది. ప్రజాస్వామ్యంలో వజ్రా యుధం వంటింది. కానీ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేయడం, మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయేవారు. కానీ అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ఈవీఎం బ్యాలెట్లలో నోటా(నన్ ఆఫ్ ద అబోవ్) బటన్ తీసుకొచ్చింది. అభ్యర్థులు ఎవరూ సరైన వారు కారని ఓటరు భావించిన పక్షంలో నోటాకు ఓటు వేయవచ్చు. అయితే నోటాకే అత్యధిక ఓట్లు పోలైనా...ఆ స్థానంలో మెజార్టీ ఓట్లు సాధించిన అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు. ఈ సారి జిల్లాలో నోటాకు పోలైన ఓట్ల సంఖ్య కాస్త పెరిగింది. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 12,058 మంది నోటాకు ఓటేశారు. అత్యధికంగా మడకశిర నియోజకవర్గంలో 2,728 మంది నోటా బటన్ నొక్కారు. ఇక హిందూపురం పార్లమెంట్ పరిధిలో నోటాకు 15,950 ఓట్లు పోలయ్యాయి.

ఇలా ఈవీఎంల్లోకి..

2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా నోటాను ప్రవేశపెట్టారు. దీన్ని భావవ్యక్తీకరణలో అంతర్భాగంగానే పరిగణించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. తొలిసారిగా 2013 డిసెంబర్‌లో ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో నోటాను ప్రవేశపెట్టారు. అన్ని గుర్తులకంటే చివరలో నోటా గుర్తు ఉంటుంది. ఈ గుర్తును అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ రూపొందించింది.

స్వతంత్రులకు పోలైన ఓట్ల కంటే ఎక్కువ..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో కొందరు స్వతంత్ర అభ్యర్థులు, వివిధ పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మూడు చోట్ల నోటా నాల్గో స్థానంలో, మూడు చోట్ల ఐదో స్థానంలో నిలిచింది.

క్లుప్తంగా

కవితా సంపుటాల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఈ ఏడాది విమలా శాంతి సాహిత్య అవార్డు–24 ప్రదానానికి గాను కవులు, రచయితల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కవితా సంపుటాను నాలుగేసి కాపీలు చొప్పున ఈ నెల 15వ తేదీ లోపు 'ఉప్పరపాటి వెంకటేశులు, 16–37–1 రాహుల్‌నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం – 5115004' అనే చిరునామా పంపాలి. పూర్తి వివరాలకు 97042 29692లో సంప్రదించవచ్చు.

నీటి తొట్టెలో పడి వ్యక్తి మృతి



నీటి తొట్టెలో తేలియాడుతున్న మృతదేహం

అమరాపురం: ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... అమరాపురంలోని పాత ఎస్సీ కాలనీలో నివాసముంటున్న నాగరాజు (61)కు భార్య కమ్మలమ్మ, కుమారులు ఉన్నారు. మద్యానికి అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో ఇంటి ఆవరణలోని మంచం మీద నిద్రించేవాడు. సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రించిన నాగరాజు మంగళవారం ఉదయం కనిపించకుండాపోయాడు. దీంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఇటుకల బట్టీల వద్ద ఉన్న నీటి తొట్టెలో మృతదేహం తేలియాడుతుండడం గమనించిన కార్మికుడి సమాచారం మేరకు కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని నాగరాజుగా గుర్తించారు. మంగళవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి మృతి చెంది ఉంటాడని భావించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



రంగనాథ (ఫైల్)

అమరాపురం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం గొల్లమారనపల్లికి చెందిన చిక్కప్ప కుమారుడు రంగనాథ (25) మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. మద్యం మానేయాలని తల్లిదండ్రులు పలుమార్లు హెచ్చరించినా వినేవాడు కాదు. ఈ క్రమంలో మంగళవారం ఫుల్‌గా మద్యం సేవించిన రంగనాథ... ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే కర్ణాటకలోని శిర పట్టణంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బుధవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపారు.



పంపనూరు సిటీ పార్కు ముఖద్వారం



పార్కులో బొమ్మలతో ఆడుకుంటున్న పిల్లలు



బొమ్మల వద్ద ఫొటోలు దిగుతున్న చిన్నారులు

అద్భుతం.. మనోల్లాసం

- సందర్శకులతో సందడిగా మారిన సిటీ పార్క్

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం సమీపంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిటీ పార్క్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలతో కలసి సరదాగా గడిపేందుకు కుటుంబాలు భారీగా తరలిస్తున్నాయి. ఈ క్రమంలో సిటీ పార్క్‌కు సందర్శకుల తాకిడి మరింత పెరిగింది. ఈ పార్క్‌ను సందర్శించిన వారు ఓ అద్భుతమని వర్ణిస్తున్నారు. మనోల్లాసానికి ఎంతో దోహదపడుతుండడంతో తరచూ తాము ఈ పార్క్‌ను సందర్శిస్తుంటామని పేర్కొంటున్నారు.



పార్క్‌లో పర్యటిస్తున్న సందర్శకులు



ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు

రవాణా శాఖ కార్యాలయాల్లోనే డీఎల్

- ఉప రవాణా కమిషనర్ కరుణసాగర్‌రెడ్డి

హిందూపురం అర్బన్: రవాణా శాఖ కార్యాలయాల్లోనే డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారని జిల్లా ఉప రవాణా కమిషనర్ కరుణసాగర్‌రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి డ్రైవింగ్ స్కూళ్లలో డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చునంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అంశాన్ని ఆయన ఖండించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.... డ్రైవింగ్ లైసెన్స్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేదంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అంశం అవాస్తమన్నారు. 2021, జూలై 1న కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని, అయితే ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదన్నారు. ఎల్‌ఎల్‌ఆర్, డీఎల్ కోసం స్లాట్ బుక్ చేసుకుని రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించే పరీక్షలకు విధిగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 12ను అనుసరించి ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రైవింగ్ స్కూళ్లకు గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. అక్రిడేటెడ్ ట్రైనింగ్ సెంటర్ గుర్తింపు పొందడానికి రెండు ఎకరాల స్థలం, మీడియం, భారీ వాహనాలకు కనీసం రెండు నుంచి మూడు ఎకారాల స్థలం ఉండాలన్నారు. వీటితో పాటు రెండు తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రాజెక్ట్ సిస్టమ్, బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం, డ్రైవింగ్ ట్రాక్‌లు, డ్యూయల్ కంట్రోల్‌తో ఓ వాహనం, ఇతర మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఓ ప్రైవేట్ వాహనం ఢీకొని చిలమత్తూరుకు చెందిన ఖాదర్‌బాషా (70) మృతి చెందాడు. బుధవారం చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఘటనలో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్న ఖాదర్‌బాషాను వెంటనే బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ గంగాధర్ కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నేటితో ముగియనున్న ఎన్నికల కోడ్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్– ఎంసీసీ) బుధవారంతో ముగియనుంది. మార్చి 16న ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. వెనువెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ జూన్ 6 తేదీ వరకు ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొంది. అటు తరువాత రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగనున్నాయి.

కారు ఢీ - విద్యార్థి మృతి



మృతి చెందిన మంజునాథ

రాయదుర్గం టౌన్: స్థానిక పైతోటలో జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మంలడం వైద్యం గుండ్లపల్లికి చెందిన రామాంజనేయులు కుమారుడు మంజునాథ్ (14) 8వ తరగతి చదువుతున్నాడు. సెలవుల నేపథ్యంలో పైతోటలోని మేనమామ ఇంటికి వచ్చాడు. బుధవారం రాతఇర 8 గంటలకు రోడ్డు దాటుతున్న సమయంలో మొలకాల్మూరు వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్యాన్సర్‌నూ నయం చేయొచ్చు



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారులు

అనంతపురం మెడికల్: ప్రారంభదశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే సరైన వైద్య చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చునని అనంతపురం డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్ అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై వైద్యులు, సిబ్బందికి అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్యాన్సర్ రోగులకు అందించే అధునాతన వైద్య చికిత్సలపై ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలోని కొందరు వైద్యులు విశాఖపట్నంలోని హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందారని గుర్తు చేశారు. వారి ద్వారా ఇక్కడి వైద్యులకు క్యాన్సర్ నివారణ చికిత్సలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గ్రామ స్థాయిలోనే క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించేలా బహుళ దశల వారీ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యుల తర్వాత డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు, గైనకాలజిస్టు స్పెషలిస్టులకు త్వరలో శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడో దశలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఉంటుందన్నారు. రొమ్ము, దంత, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించడమే లక్ష్యంగా శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర జి.నారాయణస్వామి, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుకొండలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం



యువకుడి మృతదేహం

మడకశిర రూరల్: మండలంలోని గుర్రపుకొండ గ్రామ సమీపంలో గుర్తుతెలియని ఓ యువకుడి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పెనుకొండ డీఎస్పీ షేక్‌బాజీజాన్ సైదా, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ముఖం, శరీరం, కాళ్లు దహనం చేసిన గుర్తులున్నాయి. స్నిఫర్ డాగ్‌ను రంగంలో దించి ఆధారాల కోసం ప్రయత్నించారు. మృతుడు ఎవరైనది తెలియరాలేదు. ఇతర ప్రాంతంలో హత్య చేసి రాత్రి సమయంలో తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో మృతుడిని ఎవరు గుర్తు పట్టకుండా ఉండేందుకు ముఖం, శరీరంపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి ఉంటారని భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

ధర్మవరం అర్బన్: ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌కుమార్ హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గత నెల 30న హిందూపురం పట్టణానికి చెందిన సంపత్‌కుమార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి, మృతదేహాన్ని ధర్మవరం చెరువు సమీపంలో కంపచెట్లలో పడేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం సాయంత్రం ఆరుగురు అనుమానితులను ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు త్వరలో ఈ కేసులో మిస్టరీని ఛేదించి, నిందితులను అరెస్టు చూపే దిశగా పోలీసులు అడుగేస్తున్నట్లు తెలుస్తోంది.

పాముకాటుతో వ్యక్తి మృతి



దేవన్న (ఫైల్)

బొమ్మనహాళ్: పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్‌కు చెందిన తెలుగు దేవన్న (55)కు భార్య చిత్తమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయనను పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : డీఎఫ్‌ఓ





సిటీ పార్క్‌లో మొక్క నాటి నీరుపోస్తున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, అనంతపురంలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ ప్రజలకు జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌ఓ) వినీత్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సిబ్బందితో కలసి ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న సిటీ పార్క్‌లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌ను పరిశీలించారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసులు, ఎఫ్ఎస్‌ఓ ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌బీఓ దామోదర్, తేజేశ్వరరెడ్డి, ఏబీఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనంతపురం సెంట్రల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో బుధవారం చేపట్టిన గ్రీన్ ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజు, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, ఎకాలజీ సెంటర్ సీఈఓ మురళీకృష్ణ, నగర పాలకసంస్థ ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, డీసీహెచ్ఎస్ రవికుమార్, జిల్లా కోర్టు అధికారి నల్లప్ప, డీసీఎస్ ఆనందభాస్కర్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ పీవీ కిషోర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ విధిగా ఓ మొక్క నాటి పరిరక్షించాలన్నారు. అనంతరం కృష్ణ కళామందిరంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ట్రాక్ మెయింటెనర్ల సమస్యలు పరిష్కరించండి

- ఎస్‌సీఆర్ఎంయూ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్





సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్, హాజరైన ట్రాక్ మెయింటెనర్లు

గుంతకల్లు: రైల్వే ట్రాక్ మెయింటెనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తక్షణమే పరిష్కారించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్ మెయింటెనర్ల సేఫ్టీ సెమినార్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ఇంజనీరింగ్ యూనిట్లలో పనిచేస్తున్న ట్రాక్ మెయింటెనర్ల ఇబ్బందులను ప్రస్తావించారు. నైట్ ప్రెటోలింగ్ విధులకు తప్పనిసరిగా ఇద్దరిని కేటాయించాలన్నారు. అంతేకాక వీరికి ఇస్తున్న పనిముట్ల కాలం చెల్లిపోయి ఇబ్బంది పడుతున్నారని, వెంటనే కొత్త వాటిని సమకూర్చాలన్నారు. రైలు పట్టాల పక్కన మృతదేహాలను గుర్తించినప్పుడు కాపలాకు ట్రాక్ మెయింటెనర్లను నియమించరాదన్నారు. 8 గంటల పని విధానం, బేషరతుగా సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ సహాయ కార్యదర్శులు బీఎం బాషా, అశ్విని, జోనల్ నాయకులు శేఖర్‌బాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మస్తాన్‌వలి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ముగ్గురి మృతి

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారు. టీవీల్లో ఎన్నికల ఫలితాలను పరిశీలించిన అనంతరం గుండెపోటుకు గురై మృతి చెందారు.



బొమ్మన్న (ఫైల్)



రామచంద్ర (ఫైల్)



జూటూరు కిష్టయ్య (ఫైల్)

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామానికి చెందిన తలారి బొమ్మన్న (62) వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నాడు. మంగళవారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో పార్టీ ఓటమి పాలైనట్లు తెలియగానే ఒక్కసారిగా ఛాతీ పట్టుకుని కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు... బొమ్మన్న మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.


- పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ రామచంద్ర (45) పార్టీ ఓటమిని తట్టుకోలేక మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఉదయం నుంచి టీవీ వద్దనే కూర్చొని ఎన్నికల ఫలితాలను చూస్తున్న ఆయన సాయంత్రానికి తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఈ క్రమంలో పార్టీ ఓటమిని తట్టుకోలేక బోరున రోదిస్తూ ఒక్కసారిగా ఛాతీ పట్టుకుని కుప్పకూలాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

- వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన జూటరు కిష్టయ్య (60) గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీకి వీరాభిమానిగా గ్రామంలో గుర్తింపు పొందిన కిష్టయ్య... మంగళవారం టీవీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలను గమనిస్తూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక రెండు రోజులుగా తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. బుధవారం సాయంత్రం కుటుంబసభ్యులతో మాట్లాడుతూ... ఇక తమకు కష్టాలు తప్పవంటూ ఉన్నఫళంగా ఛాతీ పట్టుకుని కుప్పకూలి మృతి చెందాడు. ఆయనకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తాగుబోతు వీరంగం



మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న సాయి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హారతి

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేటలో ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. వివరాలు... గ్రామానికి చెందిన వి.సాయి బుధవారం సాయంత్రం మద్యం మత్తులో గ్రామంలో హల్‌చల్ చేశాడు. వారించబోయిన తన చెల్లెలు హారతిపై కర్రతో దాడి చేశాడు. ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. గ్రామ మహిళా పోలీసు వెంటనే జోక్యం చేసుకుని వారించబోవడంతో మరింత రెచ్చిపోయాడు. గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది అడ్డుకోవడంతో వారిపై ఎదురు దాడికి దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని తాగుబోతును అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రురాలిని పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.